
# నిజమైన డాక్టరు



## ముద్దంశెట్టి హనుమంతరావు

ఎముకల గూడులావున్న బక్కపల్చని శరీరం...

సంస్కార రహితంగా వున్న చింపిరి జుత్తు...

మాసిన గడ్డం...

లోతుకుపోయిన కళ్ళు...

ఇదీ, దైన్యానికి ప్రతిరూపంగా అగుపిస్తోన్న రామయ్య అవతారం. అతడు రిక్షా తొక్కుతూ బ్రతుకు నీడ్చుకొస్తోన్న శ్రామికుడు.

ఆత్రుతతో, కంగారుతో, డాక్టరు దగ్గరికి వచ్చాడు, రామయ్య. మాసికలువేసి, బాగా మాసి వున్న అతడి దుస్తులు చూస్తూ వుంటే, అతడు సాగిస్తోన్న జీవితం ఎంత దుర్భరంగా వుందో, యిట్టే అర్థమైపోతుంది.

రామయ్య వెంట, అతడి భార్య రాములమ్మ, చంకని చంటిపిల్లాడు, వున్నారు. రామయ్య భార్యగా ఆమెను ఊహించుకుంటే చాలు— కళ్ళకు కట్టినట్టుగానే అగుపిస్తుంది. ఆమె కళ్ళల్లో ఆవేదన, ఆత్రుత, కంగారు స్పష్టంగా చంటాడి మీదే వుంటోంది.

"దండాలు బాబయ్యా!" వినయంగా చేతులు జోడించాడు రామయ్య.

డాక్టర్ వేణు, రామయ్యకేసి చూచాడు. రామయ్య వెంటవున్న రాములమ్మకేసి, ఆమె చంకనున్న చంటిపిల్లవాడికేసి అతని దృష్టి మళ్ళింది. చంటాడికి వొంట్లో బాగుండలేదని యిట్టే గ్రహించేశాడు. అక్కడింకా నలుగురైదుగురు పేషెంట్లు వున్నా, రామయ్య దంపతుల ఆరాటం, ఆందోళన, యితణ్ణి కదిలించి వేసింది.

"ఏమయ్యిందోయ్?" ప్రశ్నించాడు, డాక్టర్ వేణు, రామయ్యను.

"బాబయ్యా, చంటాడికి నాలుగురోజుల్నుంచీ జొరం. ఎన్నో మందులు వాడినాం బాబయ్యా, తగ్గనేదు. తవరి దగ్గిరికి పొమ్మని శానామంది సెప్పినారు. రిక్షా తొక్కుకుని బతుకుతున్నోణ్ణి. రోజంతా కష్టపడి సంపాదించి, తవరి దగ్గిరి కొచ్చినాను బాబయ్యా! తవరు దయతల్చి దేవుడిమల్లె మా సంటోడ్ని ఆదుకోవాల బాబూ: ఈడొక్కడే మా ఇంటిదీపం..." దీనాతి దీనంగా చెప్పుకుపోయాడు, రామయ్య.

రాములమ్మ, తన ఆవేదనని వ్యక్తం చేస్తున్నట్టుగ చీర చెంగుతో కళ్ళొత్తుకుంటోంది.

"ఇలా తీసుకురా:" అంటూ చంటాణ్ణి టేబిలుమీద పడుకోబెట్టి, పరీక్ష చేశాడు, డాక్టర్ వేణు. జ్వర తీవ్రత బాగా వుంది. సరైన మందులు పడలేదని గ్రహించాడు.

"ఎట్లా వుంది బాబయ్యా?" ఆత్రుతగా అడిగాడు, రామయ్య.

"సరైన మందులు పడలేదు. మరేం కంగారు పడకులే. మందులిస్తాను... తగ్గిపోతుంది. తీసుకు రావడం ఆలస్యం చేశారు గాబట్టి, కొద్దిగా టైము తీసుకుంటుందంతే!" అంటూ తన బేగ్‌లోంచి నాలుగు మాత్రలు తీసి అందించాడు రామయ్యకి.

"సగం ముక్క ప్రతీ రెండు గంటలకోసారి వేస్తూ వుండు." అని చెబుతూ, మరో కాగితం తీసి ప్రిస్క్రిప్షన్ రాసిచ్చి "ఇందులో రాసిన మందు, మందులషాపులో తీసుకుని, రోజుకి మూడుసార్లు చిన్న చెంచాతో యివ్వాలి." అన్నాడు, డాక్టర్ వేణు.

"అలాగే బాబయ్యా!" అంటూ తృప్తిగా జేబులోంచి అయిదురూపాయల నోటు తీసి, కృతజ్ఞతా పూర్వకంగా డాక్టరుకి అందించాడు.

డాక్టరు వేణు, ఆ అయిదు రూపాయిల్ని మామూలుగానే జేబులో వేసుకున్నాడు.

"రేపు సాయంత్రం మళ్ళీరావోయ్. అప్పటికి తగ్గిపోతుందిలే" అన్నాడు వేణు.

అతని మాటలు, రామయ్యకీ, రాములమ్మకీ, యెంతో వూరట కలిగించాయి. కొందరు డాక్టర్లు వూరికే కేకలు వేస్తారు. రోగుల్లో అంతులేని భయాందోళనల్ని కలిగిస్తారు. అది వారి వారి మనస్తత్వాలబట్టి వుంటుంది. డాక్టర్ వేణు మాత్రం కేవలం తన చల్లని మాటలతోనే, వుపశమనాన్ని కలిగిస్తాడని ప్రతీతి.

"తమరు రాసిచ్చిన యీ మందు యే మాత్రం ఖరీదు వుంటుంది బాబయ్యా?" ప్రశ్నించాడు, రామయ్య.

తాను రాసిచ్చిన సిరప్ కనీసం అయిదు రూపాయలయినా అవుతుందని, డాక్టర్ వేణుకి తెలుసు. తన దగ్గర ఆ సిరప్ వుంటే, యిచ్చేవాడే! కాని, లేదు.

"అయిదు రూపాయిల చిల్లరవుతుందోయ్. తప్పని సరిగ యిదివ్వాలి." అన్నాడు వేణు, రామయ్యకేసి చూస్తూ.

రామయ్య మొహంలో కళలేదు. తన కొడుక్కి నయమవుతుందని కొన్ని సెకెండ్ల క్రితం అతనిలో యేర్పడ్డ తృప్తి కూడా మటుమాయ మయ్యింది. అతని మొహం చూస్తుంటే, వేణుకి అనిపించిందే మిటంటే, అతడి దగ్గర ఆ సిరప్ కొనడానికి అవసరమయ్యే పైకం లేదేమోనని.

"అలాగే బాబయ్యా, తప్పకుండా కొంటాను... కొంటాను" అన్న రామయ్య స్వరంలో కంపన ధ్వనించింది.

డాక్టర్ వేణు హృదయం, ద్రవించిపోయింది. మానవతా దృష్ట్యా, అతనిలో నూతన చైతన్యం చోటు చేసుకుంది. ఆ మందు కొనడానికి రామయ్య యింకెంత శ్రమించాలో? అసలు, యిటువంటి జనాభా, దేశంలో యింకెంత మంది వున్నారో యెవరికి తెలుసు? ... ఇలా ఆలోచించేసరికి, డాక్టర్ వేణుకి మతి పోయినట్టయ్యింది.

రామయ్య అప్పటికే వెనక్కి తిరిగి వెళ్లబోతున్నాడు.

"చూడవోయ్ ..." అంటూ రామయ్యని వెనక్కి పిల్చాడు డాక్టర్ వేణు.

రామయ్య వెనక్కి తిరిగాడు.

"ఏంటి బాబయ్యా?" అన్నాడు. ఎక్కడో నూతిలోంచి మాట్లాడుతున్నట్టుగా వుందా గొంతు.

డాక్టర్ వేణు, జేబులోంచి పదిరూపాయలు తీశాడు. "ఈ డబ్బు నీ దగ్గరుంచవోయ్...మందులకి చాలకపోతే యీ డబ్బు ఖర్చుపెట్టు..." అన్నాడు వేణు, పదిరూపాయలనోటు అలా పట్టుకుంటూనే.

రామయ్య విస్తుపోయాడు. ఆ డబ్బు తీసుకోడానికి మనస్కరించ లేదతనికి.

"వద్దు బాబయ్యా! నానేదో తంటాలు పడతాను." కంగారుగా అన్నాడు రామయ్య.

"ఫరవాలేదు లేవోయ్. మొదట నీ అవసరం తీరనీ; మీ చంటాడికి ఆరోగ్యం కుదుటబడనీ. ఇటువంటి పదులు, నేను యెన్నో సంపాదిస్తున్నాను. కాని, నువ్వు వున్నపాటున ఆర్జించలేవు. అబ్బాయికి, యీ మందు చాలా అవసరం ప్రస్తుతానికి. అంతగా నా డబ్బు నీకు అవసరం లేదనుకుంటే, నీ దగ్గరున్నపుడు యిచ్చేద్దువుగానీ" అంటూ రామయ్య చేతిలో ఆ పదిరూపాయల నోటు పెట్టాడు డాక్టర్ వేణు.

రామయ్య, స్థాణువుగా వుండిపోయాడు. అతని కళ్లలో ఆనందభాష్పాలు మెరిశాయి. రాములమ్మ మొహంలో వెయ్యిదీపాల కాంతి పుంజుకుంది.

"మీరు డాక్టరు కాదు బాబయ్యా! దేవుడు... మా లాంటోళ్ళ పాలిట దేవుడు. తమరి ఋణం వుంచేసుకోను బాబయ్యా! తీర్చుకుంటాను. వెళ్ళొస్తా బాబయ్యా!" రెండు చేతులూ జోడించి, కృతజ్ఞతా పూర్వకంగా అన్నాడు, రామయ్య.

"రేపు రావోయ్ ..."

"అట్లాగే బాబయ్యా!" వుత్సాహంగా నడిచాడు, రామయ్య. అతని వెంట రాములమ్మ నడిచింది.

అక్కడున్న యితర రోగులు, వాళ్ళతోపాటు వచ్చినవాళ్ళు, డాక్టర్ వేణు ఔదార్యం చూసి, ముక్కుమీద వేలేసుకున్నారు. ఇటువంటి సంఘటన వాళ్ళందరికీ కొత్తమరి!

మానవతా దృష్టితో, మానవసేవే పరమావధిగా పెట్టుకోవల్సిన డాక్టర్లలో యే కొద్దిమంది డాక్టర్లయినా, డాక్టర్ వేణు లాంటి మనస్తత్వం కలిగివుంటే, దేశంలోని నిరుపేదలకు యెంత ఆసరాగా వుణ్ణు ... అనుకున్నారు వాళ్ళంతా. వాళ్ళ దృష్టిలో, డాక్టర్ వేణు నూరుపైసల రికార్పయిన డాక్టరు! ★






నూతన యవ్వనం పొందండి! సంతానవంతులు కండి. చర్మవ్యాధుల నుండి విముక్తులు కండి. హస్త ప్రయోగమువలన కలుగు నరముల బలహీనత, శీఘ్ర స్కలనము, అంగము చిన్నదగుట, అవసరకాలమందు అసంతృప్తి, సంతానము లేకపోవుట, సమస్త చర్మవ్యాధులకు అద్భుత చికిత్స! పోస్టుద్వారా చికిత్స కలదు.

"క్యాంపులు" :— ప్రతి ఆదివారం 'భీమవరం' షణ్ముఖ లాడ్జిలో ఉదయం 8 గం. నుండి సాయంత్రం 6—30 గం. వరకు. ప్రతినెల 1 మరియు 16 తేదీలలో 'రాజమండ్రి' హోటల్ అప్సరలో మధ్యాహ్నం 12 గం. నుండి రాత్రి 9 గం. వరకు.

డా॥ డి. మార్కండేయులు, ఆయుర్వేద భిషక్,

సెక్స్ & స్కిన్ స్పెషలిస్ట్, పార్కురోడ్, *గుడివాడ*-521 301 ★ ఫోన్స్ : 522 & 540.

## ఇది మీకు చాలా ఉపయోగం

మీకు "వ్యవహారదర్శిని" అనే తెలుగుపుస్తకం చాలా ఉపయోగం. అందులో ఆస్తి కొన్నా అమ్మినా తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యాపార, పరిశ్రమలకె లాంటి లైసెన్సులు తీసుకోవాలి, అన్నిమతాల వివాహ, విడాకుల నిబంధనలు స్త్రీపురుషుల ఆస్తిహక్కులు, పెద్దవారితో ప్రమాదం రాబోతే పోలీసురక్షణకు ఎవరికెలా వ్రాయాలి, ఇండ్లస్థలాలకెలా ధరఖాస్తు పంపాలి, లాడ్జింగుల్లో వ్యభిచారనిరోధరూల్సు, వాటినుంచి రక్షణవివరాలు, మీరుతెలుసుకోదగిన అనేక చట్టాలవివరాలు, నోట్లు, దస్తావేజులు, ఒప్పందాలు, పిటీషన్లు, ఫిర్యాదులు ఉత్తరాలు ఎలావ్రాయాలి, వాటివివిధ నమూనాలు అందున్నాయి. సుమారు 300 పేజీలపుస్తకం. ధర రూ॥12. వి.పి.పోష్టుఖర్చు రూ॥3. అదనం. దేశసేవ ప్రచురణలు, నెం.2, ఇందిరానగరు, వెంగలరావునగరు టాంకుసమీపాన హైదరాబాదు-500890కు, మీ ఉపయోగానికి వ్యవహారధర్మిని పుస్తకం ఒకటి వి.పి. పోష్టుద్వారా మీకు పంపించమని నేడే ఉత్తరం వ్రాయండి

